08-06-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 251 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

## కవిత నెక్స్ట్ ఏంటీ..?



**జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :**

కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట.ఒక్క లేఖ. బీఆర్ఎస్‌తో ఆమె బంధంపై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తోంది. కవిత బీఆర్ఎస్‌లో ఉన్నారా.? వీడారా అన్నది తేలని ప్రశ్నగా ఉంది. ఇదే సమయంలో ఆమె పొలిటికల్ ఫ్యూచర్ కూడా డైలమాలో పడిందన్న టాక్ వినిపిస్తోంది. తన అసంతృప్తి గళంతో కేసీఆరే పిలిచి మాట్లాడుతారని ఊహించారట కవిత. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందంటున్నారు. గులాబీ బాస్ కేసీఆర్

...మిగతాది 2 లో

క్యాబినెట్‌లో కొత్తగా ముగ్గురు!
బిగ్ బ్రేకింగ్ న్యూస్ ఇది. చర్చలు, వడపోతల తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖరారైంది. రేవంత్ టీమ్‌లో కొత్త సభ్యులు రాబోతున్నారు. మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు లభించిబోతున్నట్లు సమాచారం. పూర్తి డీటేల్స్ తెలుసుకుందాం పదండి..



## మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్..!

**జయభేరి, హైదరాబాద్ :**

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరగబోతోంది. మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కేబినెట్‌లో మొత్తం 6 స్థానాలు ఖాళీ ఉండగా.. జూన 8, ఆదివారం ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. దీనిపై సాయంత్రానికి రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన రావొచ్చని తెలుస్తోంది. తెలంగాణ కేబినెట్ విస్తరణపై కొన్ని నెలలుగా ఢిల్లీ స్థాయిలో అనేకసార్లు చర్చలు జరిగాయి. సీఎం, డిప్యూటీ సీఎం సహా అనేక మంది ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకుంది కాంగ్రెస్ హైకమాండ్. కేబినెట్‌లో చోటు ఆశించే వారి సంఖ్య భారీగా ఉండటంతో.. అనేక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ క్షేత్రస్థాయిలో నేతల అభిప్రాయాలు తీసుకుని హైకమాండ్‌కు ఈ మేరకు నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. కేబినెట్‌లో చోటు కోసం కొంతమంది నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రేమ్‌సాగర్‌రావు, మదన్‌మోహన్‌రావు, ఆది శ్రీనివాస్, విజయశాంతి రేసులో ఉన్నారు. నల్లగొండ నుంచి బీసీ కోటాలో బీర్ల ఐలయ్య, ఎస్టీ కోటాలో శంకర్ నాయక్ పేరు కూడా తెరపైకి వస్తోంది.

...మిగతాది 2 లో

## సింధూ జలాల ఒప్పందం పునరుద్ధరించండి


■ భారత్‌ను అభ్యర్థిస్తూ నాలుగు లేఖలు రాసిన పాకిస్థాన్



**జయభేరి, న్యూఢిల్లీ జూన్ 7 :**

పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందంపై పునరాలోచన చేయాలని పాకిస్థాన్ కోరుతోంది. ఇప్పటికే ఇండియాకు నాలుగు లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. సింధూ నదికి చెందిన నీళ్లు ఇండియా అడ్డుకున్న నేపథ్యంలో.. పాకిస్థాన్‌లో నీటి సంక్షోభం మొదలైనట్లు కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తూ సింధూర్ ఆపరేషన్ చేపట్టిన

...మిగతాది 2 లో



## నీతి ఆయోగ్ అధికారులతో చంద్రబాబు సమావేశం

■ 20 లక్షల మందికి వర్క్‌ఫ్రమ్ హోమ్ కల్పించేలా ముందుకెళ్లాలన్నారు చంద్రబాబు. అలాగే విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, మన్యం సహా ఎనిమిది జిల్లాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను..

**జయభేరి, విజయవాడ, జూన్ 7:**

వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా నగరాలను ఆధారంగా చేసుకుని నీతి ఆయోగ్ ఆర్థిక ప్రణాళికలు రచిస్తోంది. అందుకు ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసిన నీతి ఆయోగ్ అధికారులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 8 జిల్లాలతో పాటు విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అంతేకాదు విశాఖను మరో ముంబైలా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఇటు 20 లక్షల మందికి వర్క్‌ఫ్రమ్ హోమ్ కల్పించేలా ముందుకెళ్లాలన్నారు


...మిగతాది 2 లో

## రోహిణి తర్వాత మాడు పగులుతోంది

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7:**

రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపుతుంది. అకాల వర్షాలు, నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో ఈ ఏడాది రోహిణి కార్తెను తప్పించుకున్నట్లే అనుకున్నప్పటికీ కానీ రివర్స్ కొడుతుంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించింది. దీంతో ఉక్కపోతతో పాటు గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వర్షాలు పడటం వల్ల మరింత ఉక్కపోత, తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ చల్లటి వాతావరణంతో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు వేడిమితో ఉడికెక్కిపోతున్నాయి. మరో వారం రోజుల పాటు ఇలాంటి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారులు స్పష్టం చేశారు. పగటి వేళ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ లో పగటి ఉష్ణోగ్రతలు నలభై డిగ్రీలు దాటే అవకాశముందని

...మిగతాది 2 లో



## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

■ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు..
■ నీళ్ల విషయంలో రాష్ట ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి
■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**జయభేరి, హైదరాబాద్ జూన్ 7 :**

గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం

...మిగతాది 2 లో

## ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్

■ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యోచన

**జయభేరి, న్యూ డిల్లీ జూన్ 7 :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. నిన్న మొన్నటి వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ ఇద్దరూ ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరి మధ్య విభేదాలు కొత్త చర్చకు దారి తీశాయి.ట్రంప్‌తో విభేదాల వేళ ఎలాన్ మస్క్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి మస్క్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మధ్య వయస్కుల్లో 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా..? అంటూ తనకున్న 20 కోట్ల మందికి పైగా ఫాలోవర్లను ప్రశ్నించారు. దీని కోసం పోల్ పెట్టారు. ఆసక్తికరంగా 80శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేశారు.



## సోనియా గాంధీకి అస్వస్థత

■ సిమ్లాలోని ఐజీఎంసీ ఆస్పత్రికి తరలింపు..!

**జయభేరి, న్యూ డిల్లీ జూన్ 7 :**

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. సిమ్లాలో ప్రియాంకాగాంధీ కుటుంబంతో కలిసి వేసవి సెలవులు గడిపేందుకు వెళ్లిన సోనియా ఆరోగ్యం క్షిణించింది. దీంతో సిమ్లాలోని ఇందిరగాంధీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. సీనియర్ వైద్యులు సోనియాకు MRI పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆరోగ్యం సిమ్లాలో క్షీణించింది. శనివారం(జూన్ 07) ఆమెను ఇందిరా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్..!

మరోవైపు తమకు కూడా కేబినెట్‌లో చోటు కల్పించాలని కొన్ని రోజుల నుంచి పలువురు మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లాకు కేబినెట్‌లో కచ్చితంగా ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కోటాలో మల్‌రెడ్డి రంగా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది నేతలు కేబినెట్ రేసులో ఉండటంతో.. ఎలాంటి సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని ఈసారి కేబినెట్‌లో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. అయితే మంత్రివర్గ విస్తరణ విషయంలో కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆశావాహులు అసంతృప్తి చెందకుండా మరో మూడు స్థానాలు ఖాళీ ఉంచాలని నిర్ణయించినట్లు సమాచారం.

**కేబినెట్‌లో కొత్తగా ప్లేస్ సంపాదించబోతున్న ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరంటే..**

తెలంగాణలో కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ముగ్గురు కొత్తవారికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు ఆమోదం లభించింది. కాగా ఈ ముగ్గురు ఎవరన్న విషయంపై తాజాగా క్లారిటీ వచ్చింది. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రిగా అవకాశం లభించింది. అలానే.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలకు కూడా కేబినెట్‌లో బెర్త్ ఖరారైంది. మాల, మాదిగ, ముదిరాజ్ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. ఆదివారం ముగ్గురు నేతలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## నీతి ఆయోగ్ అధికారులతో..

చంద్రబాబు. అలాగే విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, మన్యం సహా ఎనిమిది జిల్లాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. పలు ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలను గుర్తించాలన్నారు. ఇటు మూలపేట నుంచి విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి కాకినాడ మధ్య బీచ్ రోడ్డును అభివృద్ధి చేసి.. జాతీయ రహదారికి అనుసంధానం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా.. 6 పోర్టులు, 17 వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్‌లను డెవలప్ చేయాలని నిర్దేశించారు. వచ్చే 7ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా ముందుకెళ్లామన్నారు.

## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు...ఇదే కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కారం నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్‌రావు వివరంగా సమాచారం అందిస్తారు.గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్‌డీఎస్‌ఏ పోదు, ఏజెన్సీ పోదు. ఆ 140 మంది చావులకు ఫలానావాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదు. బీహార్‌లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడు. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు నష్టం జరిగితే ఎన్‌డీఎస్‌ఏ రాదు, ఎవడు రాడు. అలానే అవినీతి, కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరు. ఎవరూ బాధ్యత తీసుకునేవారు లేరు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే దాని గురించి మాట్లాడే వాళ్ళు లేరు, పెద్దవాగు ప్రాజెక్ట్ రెండు సార్లు కొట్టుకు పోయినా అడిగేవాడు లేడు.కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్లు ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్తబుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికిరాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికిరానిదైతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించావని రేవంత్ రెడ్డిని అడుగుతున్నా. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసు. వాస్తవాలు తెలియజెప్పడానికి, కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై నీళ్లిచ్చిన కేసీఆర్ మీద, నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్ ప్రభుత్వంపైన అభాండాలు వేసే ప్రయత్నం చేస్తున్నారు. కమిషన్ పేరుతో నాటకాలు ఆడుతున్న విషయంలో వాస్తవాలను బట్టబయలు చేయడానికే హరీశ్ రావును తానే కోరాను. ఈ పరంపరలో ఇది మొదటి మీటింగ్. డాలస్, లండన్‌లో చాలామంది ఎన్ఆర్ఐలు తమకు కూడా వివరాలు చెప్పాలని, మేము కూడా సోషల్ మీడియాలో చెప్తామన్నారు. ఈ విషయంలో ఒకడేమో బట్టకాల్చి మీదేస్తుంటే.. మరొకడేమో తానా అంటే తందానా అంటున్నడు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరు కలిసి తెలంగాణ బొండిగ పిసికే ప్రయత్నం చేస్తున్నరు. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన పనిని కావాలని అపవాదులు వచ్చేవిధంగా అనుమానాలు కలిగేలా ప్రచారం చేస్తున్నరు, వాస్తవాలు చెప్పాలని కోరారు. జిల్లాల్లో కూడా ఇలాంటి మీటింగ్‌లు ఏర్పాటు చేస్తాం. ఇది మొదటి ప్రయత్నం కాదు. ఇప్పటికే మేడిగడ్డం పోయాం. దానిని వెంటనే రిపేర్ చేయాలని, నీళ్లిచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడం లేదని ఎన్‌డీఎస్‌ఏ యాక్ట్ కూడా చూపెట్టాం. ఓనరే రిపేర్ చేయాలని అందులో ఉంది. ప్రభుత్వం దానిని ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతుల పొలాలను ఎండబెడుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలి. గోదావరి జలాల విషయంలో ఏపీ అనుమతుల్లేకుండా కడుతున్న ప్రాజెక్టు మీద ముఖ్యమంత్రి మాట్లాడడు, బీజేపీ కేంద్ర మంత్రులు మాట్లాడరు, కాంగ్రెస్ బీజేపీ వాళ్లు నోరు తెరవరు. అందుకే గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఏనాటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష.' అని కేటీఆర్ అన్నారు.

## సింధూ జలాల.. పునరుద్ధరించండి

తర్వాత కూడా ఇండస్ వాటర్ ట్రీటీపై పాకిస్థాన్ లేఖ రాసినట్లు చెబుతున్నారు. ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే విధానంగా ఉండడం కుదరదని ఇండియా తేల్చింది. రక్తం, నీళ్లు కూడా ఒకే చోట ప్రవహించదన్నారు. సిందూ జలాల ఒప్పందాన్ని పరస్పర విశ్వాసం, స్నేహం ఆధారంగా రూపొందించారు. కానీ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్ చర్యలను భారత్ ఖండిస్తోంది. పాకిస్థాన్ నీటి వనరుల శాఖ కార్యదర్శి సయ్యిద్ అలీ ముర్తాజా ఆ లేఖలను .. కేంద్ర జలశక్తి మంత్రిత్వ కార్యాలయానికి పంపినట్లు స్పష్టం అవుతున్నది. ఆ లేఖను మళ్లీ విదేశాంగ కార్యాలయానికి పంపారు.నీటి సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ఆకలితో చస్తామని, సింధూ పరివాహక ప్రాంతం తమకు జీవాధారం అని, మూడో వంతు నీళ్లు తమకు దేశం బయటి నుంచి వస్తోందని, సిందూ బేసిన్‌పై 10లో 9 మంది ఆధారపడుతారని, 90 శాతం పంటలు ఆ జలాలపైనే ఆధారపడుతాయని, పవర్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు అన్నీ సింధూ నదిపైనే కట్టారని, మాపై వాటర్ బాంబు పడినట్లు ఉందని, దాన్ని త్వరగా డిఫ్యూజ్ చేయాలని ఇటీవల పాకిస్థాన్ సేనేటర్ సయ్యిద్ అలీ జాఫర్ తెలిపారు. సింధూ, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లజ్ నదులకు చెందిన నీటిని వాడుకునేందుకు 1960లో ఇండస్ వాటర్ ట్రీటీని ఏర్పర్చుకున్నారు.

# జీడీపీ సరే.. జీవన ప్రమాణాల సంగతేంటి

**భారతదేశం 4 ట్రిలియన్ల డాలర్ల జిడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయమని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీలిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళ్లు వెల్లడవుతాయి.**




ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జిడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జిడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జిడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారుఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనం తోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ సవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనదిఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు, తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జిడిపి పరిమాణం మాత్రమే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి.దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా?.విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అసమానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారతదేశ ఆర్థిక మైలురాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం, మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి.

> **1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది.**



## కవిత నెక్స్ట్ ఏంటీ..?

కవిత కామెంట్స్ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని టాక్. ఏదైనా సమస్య ఉంటే డైరెక్టుగా తన దగ్గరకు వచ్చి చెప్పి ఉంటే బాగుండేది.. లెటర్ రాసి రాద్ధాంతం క్రియేట్ చేసిందనే ఆగ్రహంతో ఉన్నారట గులాబీబాస్ కేసీఆర్. పార్టీలో లోటుపాట్లపై కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. తండ్రి కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కామెంట్స్ చేసి పెద్ద చర్చకు దారితీశారు. తాను కేసీఆర్‌కు రాసిన లేఖ ఎలా లీక్ అయ్యిందో తేల్చాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ పలు వ్యాఖ్యలు చేసింది కవిత. ఈ క్రమంలో కవిత ఏదో పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నారన్న చర్చ జరిగింది. అంతలోనే మళ్లీ రూట్ మార్చిన కవిత... తండ్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులిచ్చిన అంశంపై..హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర నిరసన తెలిపింది. అయితే ఆ ధర్నా చేయడం వెనుక కవిత ప్లాన్ వేరే ఉందని..ఆ స్ట్రాటజీ వర్కౌట్ అయినట్లు కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.బీఆర్ఎస్‌లో కేసీఆరే సుప్రీం లీడర్. అందులో ఎవరికీ అనుమానాలు లేవు. అలాంటి కేసీఆర్‌కు మద్దతుగా కవిత ధర్నా చేస్తే అక్కడ ఒక్క గులాబీ జెండా కూడా కనిపించలేదు. కవిత ఇన్వైట్ చేశారో లేదో..లేక ఆమె పిలిచినా ఎవరు రాలేదేమో కానీ.. ఒక్క బీఆర్ఎస్ లీడర్ కూడా ఆమె నిర్వహించిన ధర్నా వైపు రాలేదు. గతంలో కవిత ఎప్పుడు కార్యక్రమాలు నిర్వహించినా పోటా పోటీగా వచ్చి అటెండెన్స్ వేయించుకునే గులాబీ పార్టీ నేతలు ఇప్పుడు మాత్రం మొహం చాటేశారు.అయితే కవిత ఇన్ని రోజులు చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు. ఇప్పుడు కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన మహాధర్నా మరో ఎత్తని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. తెలంగాణ జాగృతి పేరుతో వందల కార్యక్రమాలు చేసిన కవితకు ప్రతీ సందర్భంలో మద్దతుగా వెంట నడిచింది బీఆర్ఎస్ క్యాడర్. ఎక్కడైనా..ఎప్పుడైనా కవితను నెత్తిన పెట్టుకుని చూసుకున్నారు గులాబీ పార్టీ కార్యకర్తలు. కానీ తండ్రి కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ లీక్ తరువాత సీన్ మొత్తం మారిపోయింది.కేసీఆర్ అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటే కేసీఆర్. అలాంటి ఆయనకు మద్దతుగా చేసిన ధర్నాలో గులాబీ జెండాలు, కండువాలు పెట్టకపోవడమంటే కవిత తనకు తానుగా పార్టీకి దూరం అవుతున్నారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఇన్నాళ్లు కవిత ఏం మాట్లాడినా, లేఖలు రాసినా ఆమె ప్రయాణం మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉంటుందని అనుకున్నారంతా. కానీ రోజు రోజుకు ఆమె తీరు చూస్తోంటే మాత్రం బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకున్నట్టే కనిపిస్తోందన్న చర్చ జరుగుతోంది. కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ తర్వాత ఆమె అమెరికా నుంచి వచ్చినప్పటి నుంచి ఏ కార్యక్రమంలో పాల్గొన్నా బీఆర్ఎస్ జెండా కానీ, ఆ పార్టీ నేతలు గాని ఆమె కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. దీన్ని బట్టే పార్టీ కవితను దూరం పెట్టేసిందని, ఆమె ఇప్పుడు ఒంటరి అయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేతలు కనీసం కవిత పేరే ఎత్తడం లేదంటున్నారు. ఎమ్మెల్సీ కవిత జోలికి ఎవ్వరూ వెళ్లొద్దని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశించిందన్న అన్న టాక్ వినిపిస్తోంది. లేదంటే ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ నేతలే ఆమెతో గ్యాప్ మెయింటెన్ చేస్తున్నారా అన్న చర్చ జరుగుతోంది. ఇక కేసీఆర్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ఇందిరాపార్క్ దగ్గర చేపట్టిన దర్నాకు బిఆర్ ఎస్ కేడర్ పూర్తిగా దూరంగా ఉండటం...ధర్నాకు కూడా పెద్దగా స్పందన లేకపోవడానికి తోడు కనీసం కేసీఆర్ నుండి పిలుపుకూడా రాకపోవడంతో ఇప్పుడేం చేయాలో పాలుపోక కవిత టీం ఆందోళన చెందుతోందట కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట. కానీ ఫామ్ హౌజ్ నుంచి మాత్రం నోరెస్పాన్స్. దీంతో కవిత చాలా నిరాశ చెందారనే చర్చ తెలంగాణ జాగృతి వర్గాల్లో జరుగుతోంది. దీంతో కవితను పార్టీ వద్దనుకుంటోందా.? లేక ఆమెనే పార్టీకి దూరంగా ఉంటున్నారా అన్న చర్చ మొదలైంది. ఏదేమైనా కవిత నెక్స్ట్ స్టెప్ ఏంటి అంటే ఇప్పటికిప్పుడైతే ఏం చెప్పలేని పరిస్థితి అంటున్నారు. ఆమె రాజకీయ భవితవ్యం ఏంటన్నది ఎవ్వరికి అంతుపట్టడం లేదంటున్నారు. బీఆర్ఎస్‌తో కవిత బంధం తెగినట్లేనా.? లేక ఆమెనే ఓ మెట్టు దిగి కేసీఆర్ గతంలో చెప్పినట్లు సైలెంట్ అయిపోతారా అన్నది వేచి చూడాలి.

## సోనియా గాంధీకి అస్వస్థత

చేర్పించారు, అక్కడ ఆమెకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యులు ఇసిజి, ఎంఆర్ఐ వంటి పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం, మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెబుతున్నారు. సోనియా గాంధీ తన సెలవులను గడపడానికి సోమవారం సిమ్లా చేరుకున్నారు. ఆమె ఛరాబ్రాలోని తన కుమార్తె, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ప్రైవేట్ నివాసంలో ఉంటున్నారు. కానీ ఆమె ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించడంతో ఆమెను ఐజిఎంసికి తీసుకువచ్చారు. సోనియా గాంధీని ఐజీఎంసీలోని ప్రత్యేక వార్డులో చేర్చారు. ఆమెకు MRI స్కాన్ రేడియాలజీ విభాగంలో జరిగింది. ఆసుపత్రి యంత్రాంగం ఆమె పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు (మీడియా) నరేష్ చౌహాన్ మాట్లాడుతూ, సోనియా గాంధీకి కొన్ని స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉన్నందున సాధారణ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువచ్చామని, ఆందోళన చెందడానికి ఏమీ లేదని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. ఈ సంఘటన తర్వాత, సిమ్లాలో రాజకీయ కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. హిమాచల్ ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ప్రబోధ్ సక్సేనా స్వయంగా ఐజిఎంసికి చేరుకుని సోనియా గాంధీ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. దీనితో పాటు, రాష్ట్ర ఆరోగ్య మంత్రి కూడా ఆసుపత్రికి చేరుకుని నేరుగా రేడియాలజీ విభాగానికి వెళ్లారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు కూడా తన రెండు రోజుల ఉనా పర్యటనను రద్దు చేసుకుని సిమ్లాకు బయలుదేరారు. సోనియా గాంధీ సంరక్షణ కోసం అవసరమైన ప్రతి వైద్య సదుపాయాన్ని అందుబాటులో ఉంచినట్లు ఆసుపత్రి వర్గాల తెలిపాయి. మరోవైపు ఆసుపత్రి ప్రాంగణంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. వీవీఐపీల కదలిక కారణంగా సాధారణ ప్రజల కదలికలపై ఆంక్షలు విధించారు. కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు ప్రస్తుతం సోనియా గాంధీ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని పరిశీలిస్తే, ఐజిఎంసి వైద్యుల ప్రత్యేక బృందం సోనియా గాంధీని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఆమె ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ త్వరలో అందే అవకాశం ఉంది.

## రోహిణి తర్వాత మాడు పగులుతోంది

అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్టంగా రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. నైరుతి రుతుపవనాలు చిన్న బ్రేక్ తీసుకున్నట్లు కనపడుతుంది. మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాలు వేడెక్కాయి. దక్షిణ భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాల వద్ద నైరుతి రుతుపవనాల కదలికలు ఆగిపోయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో పగటి వేళ గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండమే నైరుతి రుతుపవనాల కదలికలు నిలిచిపోయినట్లు వాతావరణ కేంద్ర తెలిపింది.... అందువల్లనే పొడిగాలులతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అయితే మరో వారం రోజుల పాటు ఇలాంటి పరిస్థితులుంటాయని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలోనూ అనేక ప్రాంతాల్లో నలభై డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రధానంగా నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పింది. అయితే కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని కూడా వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి వేళ గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు సాయంత్రానికి చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో విద్యుత్తు వాడకం పెరిగింది. ఏసీ, ఫ్యాన్ల వాడకం కూడా గత మూడు రోజుల నుంచి పెరగిందని ట్రాన్స్ కో అధికారులు తెలిపారు.

# రాష్ట్రములో కార్మికుల పనిగంటలు పెంపు ప్రభుత్వం నిర్ణయంపై రాస్తారోకో

- రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి




**జయభేరి, పరవాడ:**

రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలను రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. కార్పొరేట్లు కళ్ళల్లో సంతోషం చూడడం కోసం కార్మిక హక్కులను పణంగా పెట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు పోటీ పడుతున్నాయని గని శెట్టి అన్నారు. 29 కార్మిక చట్టాలు ఏకపక్షంగా రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తేవడంలోనే దాని కార్పొరేట్ విధేయత స్పష్టంగా కనిపించింది అన్నారు. 8 గంటల పనికోసం 1886 లో చికాగో నగరంలో పోరాడి సాధించుకున్న కార్మిక వర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకం అన్నారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది మండిపడ్డారు . సంపద సృష్టికర్తలు శ్రామికులనేది జగమెరిగిన సత్యం. కాని దానిని నిన్నకాక మొన్న సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులేనని చంద్రబాబు చెప్పారంటే కార్మికుల శ్రమను ఎంత తక్కువ చేసి చూస్తున్నారో అర్ధమౌతుంది అని గని శెట్టి అన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కాలంలో ఏఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పనిగంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణం అన్నారు. పైగా కనీస వేతనాలు షెడ్యూల్ పర్సముల్లో 15 సంవత్సరాలుగా వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదు. ఒకవైపు ధరలు పెరిగి శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి అన్నారు. కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక మాంద్యానికి దారితీస్తున్నది తెలిపారు . ఈ స్థితిలో పని గంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సిందిపోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమైంది గని శెట్టి అన్నారు. తక్షణం లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించే చట్ట సవరణలను, నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు. మనుషుల మెరుగైన జీవితానికై శ్రమ తప్ప శ్రమించటం కోసం మనుషులు కాదన్న సర్వకాలిక సత్యాన్ని ప్రభుత్వాలు గౌరవించాలని గని శెట్టి కోరారు. దీనికి వ్యతిరేకంగా జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . కార్మికవర్గం ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ దాడిని ప్రతిఘటించాలని గని శెట్టి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ వెంకనాయుడు, కే అర్జున్, ఎన్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.



# కన్స్ట్రక్షన్ పూర్తి కాకముందే పాఠశాలకు పర్మిషన్లు తెచ్చుకునే ప్రయత్నాలు

**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకురీ శ్రీకాంత్ మాట్లాడుతూ దేవరకొండలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేకుండా కన్స్ట్రక్షన్ పూర్తి కాకముందే పాఠశాలకు పర్మిషన్లు తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు శ్రీ చైతన్య పాఠశాల సమీపంలో 100 మీటర్ల లోపే ఒకవైపు ఫంక్షన్ హాల్ మరొకవైపు బార్ ఉన్నాయి అయినప్పటికీ ఇటీవలే దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ ఆ స్థలాన్ని పరిశీలించి అనుమతులు ఇచ్చేటందుకు మొగ్గు చూపడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుంది పాఠశాలకు ఫైర్ సేఫ్టీస్ లేకుండా, ఇతర ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలను ఇప్పటికైనా విద్య అధికారులు మొద్దు నిద్ర వీడి ఈ శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకొని పాఠశాల సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాలను మూసివేయాలని అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ తెలియజేస్తుంది లేనియెడల రానున్న రోజుల్లో శ్రీ చైతన్య పాఠశాల మూసివేసే అంతవరకు ఏబీవీపీ ఆందోళనలు చేసి మేమే మూసి వేస్తాం అని వారు హెచ్చరించారు.

# చలాన్లు ఎగ్గొట్టి.. బండి వదిలి వెళ్లిపోయాడు

**జయభేరి, వరంగల్, జూన్ 7:**

చక్కని బైక్ ఉంది. దూసుకుపోవడానికి రోడ్లున్నాయి. ఇంకేం అనుకున్నాడో కుర్రాడు. కానీ రూల్స్ ప్రకారం వెళ్తే సమస్యలు ఉండేవి కావు. కానీ అడ్డదిడ్డంగా నడపడం అలవాటుగా చేసుకున్నాడు. రోడ్డు మీద సీసీ కెమెరాలు ఉంటాయని.. అవి లేని చోట ట్రాఫిక్ పోలీసులు కెమెరాతో రెడీగా ఉంటారని భయపడలేదు. ఆ వారేం చేస్తారులే అన్నట్లుగా రెచ్చిపోయాడు. బైక్ తో విన్యాసాలు చేశాడు. చివరికి ఇప్పుడు ఆ బైక్ కే ఎసరు వచ్చింది. ఎందుకంటే పోలీసులు సీజ్ చేశారు. వరంగల్ లో వాహన తనిఖీల్లో భాగంగా సాయంత్రం హన్మకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతా రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అశోక జంక్షన్ వద్ద పెండింగ్ చలాన్లు ద్విచక్ర వాహనాల తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ బైక్ ను ఆపి చలాన్లు చెక్ చేశారు. చలాన్ మిషన్ కనీసం ఒక్క నిమిషం పాటు రీడింగ్ తీసుకుంది. డీ మార్ట్ సరుకుల బిల్లుగా అలా ప్రింట్ చేస్తూనే ఉంది. పోలీసులు కూడా ఆ బైక్ డ్రైవర్ వైపు.. ఆ బైక్ వైపు చూస్తూనే ఉన్నారు. ఓ నిమిషం తర్వాతా చాలా పెద్ద చలానా బిల్లుతో ప్రింట్ ఆగిపోయింది. మొత్తం 109 ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయి. వాటి విలువ 26 వేల 310 రూపాయలు .ఆ బైకర్ ను హన్మకొండ ప్రాంతానికి చెందిన బిక్షపతి గా గుర్తించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్, హెల్మెట్ లేకుండా వాహనం వంటి చలాన్లు ఉన్నాయి. అన్నింటికీ ఫోటోలు ఉన్నాయి. వాహనదారుడు బిక్షపతి కి పెండింగ్ చలాన్ల రసీదు అందజేశారు. ఫైన్లు చెల్లించేవరకు వాహనాన్ని పోలీస్ కస్టడీలోకి తీసుకొని ట్రాఫిక్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడ కొసమెరుపేమిటంటే పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పుడు కూడా భిక్షపతికి హెల్మెట్ల లేదు. అలా దూసుకు వచ్చి దొరికిపోయాడు. మామూలుగా ఆ బైక్ సెకండ్ హ్యాండ్ లో అమ్మితే యాభై వేలు కూడా వస్తాయో రావో కానీ ఇప్పుడు ఇంటికి వెళ్లి ఇరవై ఆరు వేల రూపాయలు తీసుకుని రావాల్సి ఉంటుంది. ఆ బిక్షపతి జులాయిగా తిరుగుతాడని పెద్దగా ఆలోచించి చెప్పాల్సిన పని లేదు.

# శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

- భయాందోళనలో స్థానికులు
- వాటర్ ట్యాంకు మరమ్మతులు చేయాలని డిమాండ్





**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి గ్రామానికి గత కొన్నేళ్లుగా తాగు నీటిని అందించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. 14వ వార్డులోని ప్రాథమిక పాఠశాల చేరువలో ఉన్న వాటర్ ట్యాంక్ ను నిర్మించి దాదాపు ఐదు దశాబ్దాలు కావొస్తుంది. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ క్రింది భాగంలో పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు తేలి ప్రమాదం పొంచి ఉంది. గత కొన్ని రోజులుగా వాటర్ ట్యాంక్ పైపెచ్చు ఉడి పడటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎవరిపై పెచ్చులు పడి ప్రమాదం జరుగుతుందో అని భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఈ వాటర్ ట్యాంక్ నిర్మించి దశాబ్దాలు గడుస్తుండటంతో శిథిలావస్థకు చేరిందన్నారు. గతంలో గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయితీ పాలనలో మరమ్మతులు చేసిన అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. వాటర్ ట్యాంక్ ప్రక్కన ఒకవైపు ప్రాథమిక పాఠశాల మరోవైపు నివాసగృహాలు ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతోందో తెలియకుండా ఉందన్నారు. వర్షాకాలం మొదలు అవ్వడంతో భారీగా వర్షాలు, ఈదురు గాలుల వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటుందని కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరుగక ముందే శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# పట్టణ కార్యవర్గ సమావేశం

**జయభేరి, దేవరకొండ :**



బిజేపి రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ఈరోజు దేవరకొండ బిజెపి మున్సిపల్ అధ్యక్షులు వస్కుల సుధాకర్ అధ్యక్షతన పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలూ నాయక్ కార్యక్రమ ఇంచార్జ్ BJP జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి హాజరు అయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశానికి సేవ చేయడమే మన పార్టీ లక్ష్యమని, ఈ పదకొండు సంవత్సరాలలో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పాలన, పారదర్శకత, ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందని, ప్రతి కార్యకర్త కూడా ఈ విజయయాత్రలో భాగస్వామిగా ఉండాలని పేర్కొన్నారు.
పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలోకి వెళ్లి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి చేకూర్చేలా సూచించాలని అన్నారు. అదేవిదంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పార్టీలకతీతంగా ప్రజల మధ్యలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి జె పి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ , నక్కవెంకటేష్ నేతలవెంకటేష్, జల్దా భాస్కర్, ఇడం, రవికుమార్ పట్టణ ప్రధాన కార్యదర్శులు సముద్రల సహదేవ్, చిలకరాజు బిక్కు, చిత్రాల నాగేంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు వజ్ర కుమార్, పట్టణ కోశాధికారి నీల సుమన్ రెడ్డి శంకర్, చండీశ్వర్, అర్ధం రమేష్, అప్పం అజయ్, పున్న వెంకటేష్, సంపంగి సైదులు, శేఖర్, రాము, శివ, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో భూ మిత్ర ఆప్షన్

- తెలంగాణలో భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు మండలాల్లో సేవలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ కొత్త పోర్టల్ లో 'భూమిత్ర' అనే కొత్త సర్వీస్ అందుబాటులోకి వచ్చింది.

**జయభేరి, నల్గొండ జూన్ 7 :**

రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. తెలంగాణలో వ్యవసాయ భూముల నిర్వహణకు భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు మండలాల్లో ఈసేవలు ప్రారంభమయ్యాయి. దీని ఆధారంగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియతో పాటు పలు సేవలు అందుతున్నాయి. తాజాగా ఈ పోర్టల్ కు సంబంధించి ప్రభుత్వం మరో కొత్త అప్డేట్ ఇచ్చింది. పోర్టల్ లో భూ మిత్ర ఆప్షన్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది. ఈ ఆప్షన్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలను పొందవచ్చు. ఆ ఆప్షన్ ద్వారా... భూ భారతిలో యూజర్లు అడిగే ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానమిచ్చేలా ఈ చాట్ బాట్ పని చేస్తుందని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. రైతులు ప్రాథమికంగా ఇచ్చే వివరాలతో సరైన సమాచారం ఇవ్వడానికి ఈ భూ మిత్ర ఉపయోగపడుతుందని ప్రభుత్వం వెల్లడించింది. హెల్ప్ డెస్క్ కింద ఈ చాట్‌బాట్( భూ మిత్ర)ను వినియోగించనున్నారు. ప్రాసెస్ ఇలా... ఈ సేవలను పొందటానికి ముందుగా https://bhubharati.telangana.gov (తెలంగాణ భూ భారతి) వెబ్ సైట్ లోకి వెళ్లాలి. హోం పేజీలో చివర్లో కనిపించే భూమిత్ర ఆప్షన్ పైక్లిక్ చేయాలి. ప్రాథమికంగా ఇక్కడ కొన్ని ప్రశ్నలు ఉంటాయి.. అవి కాకుండా ఇంకా ఏమైనా ప్రశ్నలు కూడా అడగొచ్చు. టైప్ చేసి సెండ్ చేస్తే... వెంటనే మీకు రిప్లే వస్తుంది. తద్వారా భూముల వివరాలు, లావాదేవీల నిర్వహణలో వచ్చే సందేహాలను నివృత్తి చేసే అవకాశం ఉంటుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్ లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలను తెలుసుకునే సేవలు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేశారు. వీటి ఆధారంగా సులభంగా భూ వివరాలను పొందవచ్చు. భూ భారతి పోర్టల్ సమస్యలు, విచారణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ ను తెలంగాణ సర్కార్ అందుబాటులోకి తీసుకువచ్చింది. పోర్టల్ లో తలెత్తే సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు వీలుగా 9140 29313999 నెంబర్ ను ప్రారంభించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య భూ భారతి టోల్ ఫ్రీ నెంబర్ సేవలను పొందవచ్చు.



# ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

**జయభేరి, మేడ్చల్ :**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిదిలోని బండ మందారం గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠను వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తుల కోలాహలంగా నిర్వహించారు. ఈ వేడుకకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఎంపీ ఈటల రాజేందర్ ను శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ ఎల్లంపేట్ జగన్ గౌడ్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ పోచయ్య, డబిల్ పూర్ పిఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు సద్ది బలరాం రెడ్డి ముదిరాజ్, దేవందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘువ రెడ్డి, మహేష్, ప్రకాష్, రవిచంద్ర, మాజీ వార్డ్ సభ్యులు కృష్ణ, కిరణ్, అశోక్ ముదిరాజ్, భాషయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు



**జయభేరి, మేడిపల్లి :**

త్యాగానికి, విశ్వాసానికి, మానవతా విలువలకు, మత, సామాజిక ఐక్యతను పెంపొందించే బక్రీద్ పండుగను మేడ్చల్ మాల్కాజ్గిరి జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని ప్రఖ్యాత కుతుభ్షాహీ అలంగీర్ మస్జిద్ నందు ముస్లింలు ప్రత్యేక "ఈద్ అల్ అధా" ప్రార్థనలు నిర్వహించారు. ఖుర్బానీ అంటే బలిదానం ఇవ్వడం, త్యాగం అనే అర్థాలున్నాయని ముస్లీం పెద్దలు అన్నారు. ఖుర్బానీ ఇవ్వడానికి హజరత్ ఇబ్రహీం అనే ప్రవక్త త్యాగమే కారణమని చెప్పారు. బక్రీద్ రోజున మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం పేదలకు, రెండో భాగం బంధువులకు, మరో భాగం తన కుటుంబం కోసం వినియోగించడం ఆనవాయితీ అని ముస్లీం సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ తాజుద్దీన్, మహబూబ్ అలీ, ఖాదర్, హమీద్, పాషా, షఫీ, ఉరూజ్, ఫిరోజ్, అబ్బాస్, నిజాం, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- మాజీ కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి




**జయభేరి, మేడ్చల్ :**

బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం నేటి నుండి జూన్ 19 వరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపుతుంది, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యనందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు.

# మృతినీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**జయభేరి, ఉప్పల్ :**

అనారోగ్యంతో మరణించిన ఉప్పల్ డివిజన్ వినాయక నగర్ కి చెందిన వడ్డేపల్లి కృష్ణ కుమారుడు వడ్డేపల్లి అఖిల్ కుటుంబానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు BRS పార్టీ ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల్ మరణించడం బాధాకరం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో చిలుగురి శ్రీకాంత్, లింగంపల్లి ప్రభాకర్, కుందనపల్లి రాజు, పెద్దుల కృష్ణ, మామిండ్ల రాజు, హరి, సుధాకర్, వడ్డేపల్లి నర్సింహా, గణేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

**జయభేరి, మేడ్చల్:**

ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ లో కరెంటు స్తంభాన్ని హ్యుందాయ్ క్రెటా కారు ఢీ కొట్టింది. కారులో నలుగురు వ్యక్తులు భార్గవ్ యాదవ్, వర్షిత్, ప్రవీణ్, దినేష్ వున్నారు. ఈ ప్రమాదంలో భార్గవ్ యాదవ్, వర్షితులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్ కు తీవ్ర గాయాలు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దినేష్ కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతవదేహాలను గాంధీ హాస్పిటల్ కి తరలించారు. వీరంతా ఎదులాబాద్ లోని విహారి ఫామ్ హౌస్ లో బస చేసినట్లు సమాచారం.

# కార్యకర్త కుటుంబానికి అండగా జనసేన నాయకులు

■ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఇటీవలే హత్యకు గురైన జనసేన క్రియాశీల కార్యకర్త అయిన మైలపల్లి బంగార్రాజు పెద్ద కర్మ సందర్భంగా ముత్యాలమ్మపాలెం గ్రామంలో బంగార్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి కార్యక్రమములో పాల్గొని కుటుంబ సభ్యులకి ధైర్యం చెప్పారు, హత్యకు గురైన హత్యకు గురైన బంగారాన్ని ఇటీవలే ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఎన్టిపిసిలో మెయింటినెన్స్ ఉద్యోగంలో జాయిన్ చేయడం జరిగిందని ఆ ఉద్యోగాన్ని బంగార్రాజు భార్య మైలపల్లి బంగారంకి ఇవ్వమని ఎన్టిపిసి అధికారులకు అక్కడ నుండే భర్త స్థానంలో భార్యకు ఉద్యోగం ఇవ్వమని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్టిపిసి బాలభారతి పబ్లిక్ స్కూల్లో బంగారు రాజు ఇద్దరు ఆడపిల్లలకు ఫ్రీ అడ్మిషన్ ఇవ్వవలసిందిగా జిల్లా కలెక్టర్ కోరారు.తక్షణమే కలెక్టర్ విజయకృష్ణన్ స్పందించి ఎన్టిపిసి యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్వయంగా 200,000 లక్షల రూపాయలు మృతుడి కుటుంబానికి ప్రకటించారు.



గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు 200,000 లక్షల రూపాయలు మృతుడి కుటుంబానికి ప్రకటించారు,జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ 50,000 రూపాయలు ప్రకటించారు.

జన సైనికులు చాలామంది తోచిన సహాయం చేయడానికి ముందుకు వచ్చారు.త్వరలో పరవాడ జనసేన పార్టీ ఆఫీసులో మృతిని జ్ఞాపకార్థం బంగారు రాజు సంస్మరణ సభ జనసేన పార్టీ పరవాడలో ఏర్పాటు చేసి మృతిడి కుటుంబానికి జనసేన పార్టీ నుండి ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నాయకులకు కార్యకర్తలకు కోరారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్, సీనియర్ జనసేన పార్టీ నాయకులు రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, నాయుడుపాలెం ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు మధు, వెన్నెల నర్సింగరావు, అనిల్, ముత్యాలమ్మపాలెం ఎంపిటిసిలు అర్జిల్లి దేవిరవి మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, మండలంలో గల మహాకూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---



## ప్రభుత్వ విప్ ను సన్మానించిన ఉద్యోగ సంఘాల నాయకులు

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 7 :**

యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదినం సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ఆయనను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, టీఎన్జీవో యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, కార్యదర్శి మహమ్మద్ ఖాదీర్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి నరసింహ, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షుడు ఆకునూరి నరసింహ, మహేందర్ పాల్గొన్నారు.

---

## జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 7 :**

సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 9 ,10,11 తేదీల్లో యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిణామాలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షక ,విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేపట్టడానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం కోసం తరగతుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య తూటి వెంకటేశం పాల్గొన్నారు.

---

## బిజెపి మండల నూతన కమిటీ నియామకం




**జయభేరి, తుర్కపల్లి, జూన్ 7 :**

తుర్కపల్లి మండలం భారతీయ జనతా పార్టీ మండల నూతన కమిటీని శనివారం మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. మండల ఉపాధ్యక్షులుగా ఆకుల భాస్కర్, ఆకుల శ్రీను, వాకుడోత్ సాయికుమార్ నాయక్, తాటికొండ నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శులు ఏడుముల ఆంజనేయులు, బినారం కనకయ్య, కార్యదర్శులు పోలబోయిన మహేష్, గోనె విజయ్, ,వజ్రొజు బాలకృష్ణ,గుగులత్ కరుణ, నరసింహ నాయక్, కోశాధికారి గా కోట భాగ్యలక్ష్మి విజయ్ లను నియమించారు.

---

## ముస్లిం సోదరి, సోదరమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



**జయభేరి, దేవరకొండ :**

బక్రీద్ పండుగ పర్వదిన పురస్కరించుకొని ముస్లిం సోదరి, సోదరమణులకు బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు టీవిన్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు ,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు Md.జనీబాబా, తదితరులు పాల్గొన్నారు.

---

## రాజధాని మహిళల నిరసన

**జయభేరి, అమరావతి:**

తుళ్లూరు లో రాజధాని మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. సాక్షి ఛానల్ తో పాటు కృష్ణంరాజు అనే వ్యక్తి పై ఫిర్యాదు చేసారు. కృష్ణంరాజు, అమరావతి మహిళల పై అసభ్యంగా మాట్లాడారని ఆరోరపించారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. కృష్ణంరాజుతో పాటు సాక్షి ప్రతినిధి కొమ్మినేని చిత్ర పటాలను చెప్పుతో కొట్టి నిరసన వ్యక్తం చేసారు.

---

# అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరి భాగ్యస్వామ్యం కావాలి

■ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులుతో ఉపసర్పంచ్ వెన్నల సన్యాసిరావు

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వర్కర్లతో స్థానిక ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ముచ్చటిస్తూ వారి యొక్క యోగక్షేమాలు తెలుసుకుంటూ ఈ సందర్భంగా ఈనెల 21వ తారీఖున అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్ రోడ్ లో భారీ స్థాయిలో యోగ డే కార్యక్రమం నిర్వహించబడును.దీనికి మన గ్రామం నుంచి కూడా ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారిని కోరారు దీనివల్ల మన యొక్క మానసిక వికాసం, ఆరోగ్యం బాగుంటుందని తెలియజేశారు. గ్రామంలో సుమారుగా 116 మంది వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉందని, వారికి ప్రతి ఒక్కరికి వారి బ్యాంకు ల ద్వారా ప్రధానమంత్రి బీమా యోజన పథకం అమలు జరిగినేటట్లు చూసుకోవాలని తెలియజేశారు. వారి నుంచి నాలుగు వారాల పని దినాల సొమ్ము రాలేదని తెలుసుకొని వెంటనే పేమెంట్ వచ్చేటట్లు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ పి .జి .గంగనాయుడు, మేట్లు వర్కర్లు పాల్గొన్నారు.

---



## ఎమ్మార్వోకి రైతులతో కలిసి వినతి పత్రాన్ని అందించిన మాజీ సర్పంచ్

**జయభేరి, దేవరకొండ :**

భూభారతి చట్టంలో భాగంగా భూ సమస్యల పరిష్కారం కొరకు నేడు దేవరకొండ మండలంలో ని కొండ భీమనపల్లి గ్రామ రైతు వేదికలో ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భాగంగా మా మర్రి చెట్టు తండా గ్రామ రైతుల యొక్క భూ సమస్యలను పరిష్కరించాలని దేవరకొండ ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందించారు, వారు మాట్లాడుతూ గ్రామంలో రైతులు పట్టా కలిగి ఉన్న కొన్ని సర్వే నెంబర్లు ఆన్లైన్ లో కనిపించడం లేదని, కోర్టు డిగ్రీ రికార్డు ద్వారా పట్టా కలిగి ఉన్న రైతుల భూమిని సర్వే చేసి భూ రికార్డు ఆన్లైన్ నందు నమోదు చేసి పట్టా మంజూరు చేయాలని చేయాలని ఎమ్మార్వో కి వినతి పత్రాన్ని అందించారు. వారి వెంట మర్రిచెట్టు తండా గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

---

## నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా భాస్కరాచారి నియామకం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణ ప్రాంతాం గాంధీ బజారుకు చెందిన చోళ్ళేటి భాస్కరాచారి చాలా సంవత్సరాలుగా స్వర్ణకారుల సంఘం బీసీ సంక్షేమ సంఘం ఉద్యమాలలో బీసీలను చైతన్య పరుస్తూ ఎన్నో ఉద్యమాలు సేవలు మరియు ప్రజా కార్యక్రమాలు చేసినందుకుగాను వారి సేవలను గుర్తించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గా చోళ్ళేటి భాస్కరాచారి ని బీసీ సంక్షేమ సంఘం సామాజికవేత్త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బాధ్యతను తనకు అప్పజెప్పినందుకుగాను చాలా సంతోషదాయకం అని అన్నారు నూతన ఉత్సాహంతో బీసీలను ఐక్యం చేయడానికి చైతన్య పరచడానికి ముందుండి ప్రజాసేవకునిగా ఉంటానని తెలిపారు, ఈ ఎన్నికకు సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

---

# జూలై నెలలో కొత్త మున్సిపాల్టీకి ఎన్నికలు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7:**

తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఈ నెల చివరి వారం లేదా జులై తొలి వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. జిల్లా, మండల పరిషత్తులంటే ఎంపీటీసీల పదవీకాలం జులై 3వ తేదీన, జెడ్పీటీసీల పదవీకాలం జులై 3వ తేదీన ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విషయానికి వస్తే చాలా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం జనవరి 26, 2025న ముగిసింది. కొన్నింటికి 2021లో ఎన్నికలు జరిగాయి. వాటి పదవీకాలం ఇంకా ఉంది. ఈ పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల ద్వారా పాలన సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు కొన్ని మున్సిపాలిటీలకు 2021లో ఎన్నికలు జరిగాయి. వీటి పదవీకాలం 2026లో ముగియనుంది. తెలంగాణలో 12,991 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. అంతకు ముందు 12,769 పంచాయతీలు ఉండేవి. జిల్లాకో జిల్లా పరిషత్తు ఉంటుంది కాబట్టి, తెలంగాణలోని 33 జిల్లాలకు గాను 33 జిల్లా పరిషత్తులు ఉంటాయి. వీటి పాలనా ప్రతినిధులుగా 33 మంది జెడ్పీటీసీలు ఉన్నారు. తెలంగాణలో 620 మండలాలు ఉన్నాయి. వీటికి మండల పరిషత్తు ఉంటుంది. వీటికి పాలనా ప్రతినిధులుగా 620 ఎంపీటీసీలు ఉన్నారు. తెలంగాణలో కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. వీటికి కలుపుకుంటే 153కు పెరుగుతుంది. ప్రస్తుతం 131 మున్సిపాలిటీలు ఉన్నాయి.తెలంగాణలో కొత్తగా ఏర్పడిన/ప్రతిపాదించబడిన మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీల వివరాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి. ఈ వివరాలు ఇటీవల వచ్చిన వార్తలు మరియు ప్రభుత్వ ప్రకటనల ఆధారంగా ఉన్నాయి, కొన్నింటికి సంబంధించిన తుది నోటిఫికేషన్లు ఇంకా వెలువడాల్సి ఉండవచ్చు.

**కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఇవే**

తెలంగాణలో ప్రస్తుతం 13 కార్పొరేషన్లు ఉండగా, కొత్తగా మూడు మున్సిపాలిటీలను కార్పొరేషన్ హోదాకు అప్‌గ్రేడ్ చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా, మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా, కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. కొత్తగూడెం కార్పొరేషన్‌గా పాల్వంచ మున్సిపాలిటీ, సుజాత్ నగర్ మండలంలోని కొన్ని పంచాయతీలను విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లేనని అధికారులు చెబుతున్నారు. ఇక మంచిర్యాల, మహబూబ్‌నగర్ కార్పొరేషన్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి.

**కొత్త మున్సిపాలిటీలు ఇవే**

ఖమ్మం జిల్లా - కల్లూరు
కామారెడ్డి జిల్లా - బిచ్కుంద
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా - ఆలియాబాద్
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా - మూడు చింతలపల్లి
మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా - ఎల్లంపేట
రంగారెడ్డి జిల్లా - మొయినాబాద్
రంగారెడ్డి జిల్లా - చేవెళ్ల
మహబూబాబాద్ జిల్లా - కేసముద్రం
సంగారెడ్డి జిల్లా - కోహీర్
సంగారెడ్డి జిల్లా - గడ్డపోతారం
సంగారెడ్డి జిల్లా - గుమ్మడిదల
సంగారెడ్డి జిల్లా - ఇస్నాపూర్
మహబూబ్‌నగర్ జిల్లా - దేవరకద్ర
ఖమ్మం జిల్లా - ఏదులాపురం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా - అశ్వరావుపేట
జనగామ జిల్లా - స్టేషన్ ఘన్‌పూర్
నారాయణపేట జిల్లా - మద్దూర్
ములుగు జిల్లా - ములుగు

అయితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు జరుపుతారా లేదా అన్నది మాత్రం చూడాలి. ఇప్పటికైతే వీటి ఏర్పాటుపై అధికారులు తీవ్రంగా కసరత్తు నిర్వహిస్తున్నారు.

# రాష్ట్రానికి కల్పతరువు కాళేశ్వరం

- సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించాం: హరీశ్ రావు

**జయభేరి, హైదరాబాద్ జూన్ 7 :**



కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కల్పతరువని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశామన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిడ్ మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడిందని తెలిపారు. ఇది వాస్తవమైన రిపోర్టు అని, నీటి పారుదలశాఖ అధికారులిస్తున్న నివేదిక అని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కిలోమీటర్లు తెలంగాణలోనే ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే.తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు. ప్రాణహితచేవెళ్ల నీటి నిల్వ సామర్థ్యం కేవలం 11 టీఎంసీలు మాత్రమే.




కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు.. రెండింటి మధ్య ఎంత తేడా.. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు.అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు. ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో రూ.20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు. నేను లెక్కలన్నీ తీయిస్తే కాంగ్రెస్ ఖర్చు చేసింది రూ.3700 కోట్లు మాత్రమేనని తేలింది. ఎందుకీ గోబెల్స్ ప్రచారం?. ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని దుష్ప్రచారం చేస్తున్నరు ఈ కాంగ్రెస్ నాయకులు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా వీళ్లే. ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు రూ.40,300 కోట్లకు పెంచారు ఇదే కాంగ్రెస్ నాయకులు. ఇదీ వీళ్ల నిర్వాకం.' అని హరీశ్‌రావు అన్నారు.కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు వెళ్తామని హరీశ్ రావు చెప్పారు. ఇక్కడ ఎవరూ భయపడడం లేదని తెలిపారు. తమకేం భయం లేదని, బాజాప్తా విచారణకు హాజరవుతామని స్పష్టం చేశారు.



## 7500 మందిపై కత్తి

**జయభేరి, న్యూయార్క్, జూన్ 7:**

ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్ వంటి ముస్లిం దేశాల పౌరులపై నిషేధం విధించిన తర్వాత, నేపాల్ విషయంలోకూడా అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేపాల్‌కు ఇచ్చిన బహిష్కరణ రక్షణను రద్దు చేశారు. ఈ నిర్ణయం తర్వాత, ఇప్పుడు 7,500 మంది నేపాలీలు వెంటనే అమెరికాను విడిచి వెళ్ళవలసి ఉంటుంది.న్యూస్‌వీక్ కథనం ప్రకారం, నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు 2015లో ఉన్నట్లు లేదని, కాబట్టి దాని బహిష్కరణ రక్షణను రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం చెబుతోంది. నేపాల్‌లో భూకంపం కారణంగా అప్పటి అమెరికా ప్రభుత్వం నేపాలీ పౌరులకు ఈ రక్షణను అందించింది. అమెరికాలో దీనిని తాత్కాలిక రక్షిత స్థితి లేదా టిపిఎస్ అంటారు. దీనిలో, తమ దేశంలోని చెడు పరిస్థితుల దృష్ట్యా అమెరికాలోకి వెళ్లి నివసించాలనుకునే వారికి అమెరికా ప్రభుత్వం రక్షణ హామీ ఇస్తుంది.బహిష్కరణ రక్షణ కింద, ఇతర దేశాల ప్రజలకు పని చేసే హక్కు మాత్రమే ఉంటుంది. అంటే, వారికి పౌరసత్వం లభించదు. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇప్పుడు ఏ దేశానికీ అలాంటి రక్షణ ఇవ్వబడదని ఆయన సూచించారు. ఇదిలావుంటే, టిపిఎస్ కింద 7500 మంది నేపాల్ పౌరులు అమెరికాలో నివసిస్తున్నారు. దీనిని రద్దు చేసిన తర్వాత, వారు వెంటనే తమ దేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. లేకపోతే, అమెరికా ప్రభుత్వం వారిని బలవంతంగా నేపాల్‌కు తిరిగి పంపవచ్చు.2017లో అధ్యక్షుడైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ దానిని అంతం చేయాలని కోరుకున్నారు. కానీ ఇమ్మిగ్రేషన్ విభాగం దానిని వ్యతిరేకించింది. ట్రంప్ చివరి వరకు దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. కానీ విజయం సాధించలేకపోయారు. నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు అలాగే లేదని, కాబట్టి బహిష్కరణ రక్షణకు అర్థం లేదని ట్రంప్ పరిపాలన చెబుతోంది.రెండు రోజుల క్రితమే అమెరికా అధ్యక్షుడు 12 దేశాల ప్రజలను నిషేధించాలని నిర్ణయించారు. ఈ దేశాలలో ఉగ్రవాదం విజృంభిస్తోందని ట్రంప్ సర్కార్ చెబుతోంది. ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ వంటి దేశాలు ట్రంప్ నిర్ణయంపై స్పందించకపోగా, చాడ్ ఖచ్చితంగా దీనికి వ్యతిరేకంగా పెద్ద నిర్ణయం తీసుకుంది. చాడ్ తన దేశంలోకి అమెరికన్ పౌరుల ప్రవేశాన్ని నిషేధించాలని నిర్ణయించింది. మన ఆత్మగౌరవాన్ని అమ్ముకుని అమెరికాతో మాట్లాడలేమని చాడ్ అధిపతి అంటున్నారు. ఖతార్ నుంచి అందుకున్న బహుమతి గురించి చాడ్ అధ్యక్షుడు ప్రస్తావించారు.

## ఇందిరమ్మ ఇళ్లపై గుడ్‌న్యూస్

- ఇకపై సిటీల్లో జీ+3 ఇళ్లు!

**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నగరాలు, పట్టణాల్లోనూ విస్తరించనుంది. ఇప్పటివరకు గ్రామాల్లో మాత్రమే ఇళ్లు నిర్మించిన ప్రభుత్వం, త్వరలోనే సిటీలలో జీ+3 అపార్ట్‌మెంట్ల రూపంలో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. పేదవాడల్లో నివసించే వారికి ఆధార్, ఫోన్ నంబర్లతో లిస్ట్ తయారు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సహాయంతో ఇళ్లు కట్టి ఇవ్వనుంది. కాగా, జూలై నుంచే ఈ నిర్మాణాలు మొదలయ్యే అవకాశం ఉంది.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా!

- ప్రత్యేక కార్పొరేషన్ ఉందా! లేదా!
- ప్రభుత్వ కార్యాలయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వెట్టి చాకిరి.
- చాలీచాలని జీతాలతో కాలం గడుపుతున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు.

**జయభేరి, గోదావరిఖని :**



తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరి ఒక తాటి మీదికి తెచ్చి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉద్యోగ భద్రత కలిగిస్తానని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఉద్యోగులు మనోవేదన గురి అవుతున్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా ఉద్యోగ భద్రత తో పాటు కుటుంబ సభ్యులందరికీ ఇ. స్. ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు వర్తిస్తాయి. అలాగే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన జీతభత్యాలు కూడా పెరుగుతాయని, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్లో అక్కడి ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన వారికి ఉద్యోగ భద్రత తో పాటు అక్కడి ప్రభుత్వం అన్ని సదుపాయాలు అందిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేడుకుంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులబెట్టి చాకిరి శ్రమదోపిడి. ప్రభుత్వ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే వారితో రోజు 14 గంటలు పని చేయించుకుంటూ చెమదోపిడి గురి అవుతున్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో సమయపాలన లేకుండా పై అధికారులు వారితో పని చేయించుకోవడం కాకుండా వారిని సూటి పోటీ మాటలతో చులకనగా చూడడం వివిధ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పై అధికారులతో మానసిక వేదన గురవుతున్నారని అంటున్నారు.


ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా!

తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంవత్సరాలకు కొద్ది చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారుతాయా! మాకు రోజులు వస్తాయా అంటూ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద మనసు తో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఉద్యోగులంతా వేడుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆదుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. వివిధ ప్రభుత్వ కార్యాలయంలో సుమారు 4 లక్షలకు పైన విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కొని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## 3 కిలోమీటర్ల దూరం ఉంటేనే కొత్త పంచాయితీ


**జయభేరి, హైదరాబాద్:**




కొత్త పంచాయతీల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు పంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నది. ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పక్కా గైడ్లైన్స్ రూపొందించి ముందు కెళ్లాలని నిర్ణయించింది. ప్రధానంగా 500 కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలను పంచాయతీలుగా మార్చడంతో ప్రభుత్వానికి అదనపు భారమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆఫీసర్లు చెప్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త పంచాయతీలు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల టైమ్లో హామీ ఇచ్చినట్లు నేతలు చెప్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వీళ్లంతా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తపంచాయతీల కోసం 250 వరకు పంచాయతీరాజ్శాఖకు దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్లతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు కూడా జతచేసి ఉన్నాయి. దీనిపై పంచాయతీ రాజ్శాఖ అధికారులు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెప్పించారు. చాలా దరఖాస్తులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది.

**3 కిలో మీటర్ల దూరం ఉండాలి...**

రాష్ట్రంలో ప్రస్తుతం 12,777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తపంచాయతీల కోసం సుమారు 250 దరఖాస్తులు రాగా.. అందులో 37 గ్రామాల్లో మాత్రమే 500 జనాభా ఉన్నట్లు తేలింది. మిగిలిన గ్రామాల్లో 500లోపు జనాభా ఉంది. వికారాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కేవలం 90 కుటుంబాలు ఉన్న ఓ పల్లెను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పంపినట్లు తెలిసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయాలంటే కనీసం 500 జనాభా ఉండాలని, పల్లెకు, పల్లెకు మధ్య 3 కిలో మీటర్ల దూరం ఉండాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



## లక్ష రూపాయలు చెల్లిస్తేనే ఇందిరమ్మ ఇండ్లు?

**జయభేరి, హన్మకొండ:**

లక్ష రూపాయలు ఎవరు ఇస్తే వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేపిస్తున్న కాంగ్రెస్ నాయకులు, హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బండారు అనిత అనే మహిళ తన భర్తతో ఇద్దరూ కూలి పని చేసుకుంటూ నలుగురు పిల్లల్ని పోషిస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.1 లక్ష ఇస్తేనే ఇల్లు మంజూరు అవుతుందని కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారని వాపోతున్న మహిళ, దీంతో చేసేదేమీ లేక రూ.50 వేలు అప్పు చేసి మరీ చెల్లించానని ఆవేదన వ్యక్తం చేసిన మహిళ ఇల్లు కట్టుకునే స్థోమత లేకనే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంటే, కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవ్వడానికి కూడా ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు.

## తొలి ప్రీమియం కిడ్స్ ఎథ్నిక్ వేర్ బ్రాండ్, స్టోర్ ప్రారంభం



**జయభేరి, హైదరాబాద్, జూన్ 7:**

పిల్లల కోసం రాజసంగా, సంప్రదాయంతో కూడిన డిజైన్‌లను అందించే పి & ఎస్ కో బ్రాండ్, తమ తొలి తెలంగాణ స్టోర్‌ను హైదరాబాద్,బంజారా హిల్స్‌లోని జివికె మాల్‌లో ప్రారంభించింది.పూజా బిహాని కనోరియా (ఎండీఐ గురుగావ్ నుండి మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్) మరియు సలోని గుప్తా బిహాని (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ - నిఫ్ట్ అలుమ్నా) కలిసి ప్రారంభించిన ఈ బ్రాండ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సలోని గుప్తా హైదరాబాదీ కానీ పెళ్లి తర్వాత కోల్కతాకు మకాం మార్చుకుందిపి & ఎస్ కో బ్రాండ్‌ను అంబానీలు, పిరమళ్లు, అదానీలు, జీవీకే కుటుంబాలు, బాలీవుడ్ ప్రముఖులు షాహిద్ కపూర్, అనుష్క శర్మ, క్రికెట్ స్టార్స్ జస్ప్రీత్ బుమ్రా, గౌతమ్ గంభీర్, ఉమేష్ యాదవ్ వంటి సెలబ్రిటీ పిల్లలు ధరించారు. ఇంగ్లాండ్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ కుటుంబం కూడా ఈ బ్రాండ్‌ను మెచ్చుకుంది.ఈ స్టోర్‌ను రాపిడ్ కార్ప్ అనే మాస్టర్ ఫ్రాంచైజీ ద్వారా తెరిచారు హైదరాబాద్‌లో ఈ ఫ్రాంచైజీని తల్లి - కుమార్తె జోడీ అయిన లతా అగర్వాల్ మరియు అక్షిత నహార్ నడుపుతున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక చిగురుపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పిల్లల డ్రెస్సింగ్‌లో కట్, ఫిట్, కంఫర్ట్, వ్యక్తిగత స్టైల్ ముఖ్యమైనవి. పి & ఎస్ కో ఈ అంశాలను బాగా అర్థం చేసుకుని అందిస్తోంది. నేను తల్లిని కాబోతున్నాను. ఈ బ్రాండ్‌ను దగ్గరగా గమనిస్తున్నాను" అని పేర్కొన్నారు.ఫ్రాంచైజీ అక్షిత నహార్ మాట్లాడుతూ, "నేను ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో పిల్లల కోసం మంచి ఎథ్నిక్ వేర్ స్టోర్ (పిల్లల కోసం సాంప్రదాయ దుస్తులకు) లేదు అని గమనించాను. అందుకే ఈ విభాగంలోకి రావాలని నిశ్చయించుకున్నాను," అని చెప్పారు.సంస్థాపకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ "మేము హైదరాబాద్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లలో దేశంలోని ఏ నగరంలోనూ లేని స్పందన కనిపించింది. ఇక్కడ మంచి ప్రీమియం కిడ్స్ వేర్ కోసం డిమాండ్ ఉంది. అందుకే మొదటి స్టోర్‌ను ఇక్కడే ప్రారంభించాలనుకున్నాం," అని తెలిపారు.

## పద్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన త్రిపుర గవర్నర్



**జయభేరి, మేడ్చల్:**

దివంగత బీజేపీ నేత పద్మారెడ్డి కుటుంబ సభ్యులను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డినాచారం లోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తరువాత అయన మాట్లాడుతూ పద్మా రెడ్డి భారతీయ జనతా పార్టీకి పాత కార్యకర్త, నేను పార్లమెంటు ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సందర్భంలో కన్వీనర్ గా ఉండి పార్టీ కోసం పనిచేసిన గొప్ప నాయకుడు, నాకు చాలా ఆప్తుడు.పద్మా రెడ్డి హఠాన్మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## 500 రూపాయల నోట్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం లేదు

**జయభేరి, న్యూ డిల్లీ, జూన్ 7:**

ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది' అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది.రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.'కాపిటల్ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తాజాగా స్పందించింది. 'కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

ప్రభాత
జయభేరి
సినిమా
08-06-2025
ఆదివారం
jayabheridaily.com



## తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్

తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కొత్త పాలక మండలిని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రవీంద్ర గోపాల, ఉదయ్‌కుమార్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్ వివిఎల్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ రావు, కోశాధికారిగా సత్యనారాయణ గౌడ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌స్‌ను ఎంపిక చేశారు. ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని, బాధ్యతాయుతంగా పనిచేసి పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని సునీల్ నారంగ్ చెప్పారు. తెలుగు సినీరంగంలో ఓల్డెస్ట్ ఛాంబర్ ఇదేనని, ఇప్పుడు 80వ జనరల్ బాడీ మీటింగ్ జరిపామని కార్యదర్శి శ్రీధర్ వివిఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెమినీ కిరణ్, సురేష్‌బాబు, కె.ఎల్.దామోదరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఈ ఐదు నెలల్లో మూడే హిట్స్**

కార్యదర్శిగా ఎన్నికైనా శ్రీధర్ వి.ఎల్. మాట్లాడుతూ '2016 నుంచి పర్సంటేజీ సిస్టమ్ గురించి చాలా మీటింగ్స్ జరిగాయి. ప్రస్తుతం సింగిల్ స్క్రీన్స్ బంద్ అయిపోతున్నాయి. వాటిని రక్షించుకోవాలి. ఇక థియేటర్ల బంద్ గురించి మేమెప్పుడూ మాట్లాడలేదు. పర్సంటేజీ సిస్టమ్ అమలు చేయాలని ఫిల్మ్ ఛాంబర్‌ను కోరాం. మేము థియేటర్స్ బంద్ చేస్తున్నామని ఎవరికీ లెటర్లు కూడా ఇవ్వలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలు ఈ విషయంలో ఇష్యూ చేశారు. వారి పేర్లు భవిష్యత్తులో వెల్లడిస్తా. వాస్తవానికి పవన్‌కల్యాణ్ సినిమా వస్తున్నదని తెలిసి థియేటర్లని ఖాళీగా పెట్టుకున్నాం. ఈ నెల మొత్తం పోయింది. జనవరి నుంచి ఇప్పటివరకు సంక్రాంతికి వస్తున్నాం, మ్యాడ్ స్వేర్, కోర్ట్ ఈ మూడు చిత్రాలే హిట్ అయ్యాయి. ఈ మూడు సినిమాల మీదనే రెంట్ వర్కవుట్ అయింది. పరిస్థితి ఇలా ఉంటే.. అనవసరంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను బ్లేమ్ చేస్తున్నారు. ఈ రోజు హీరోలు రెండేళ్లకో సినిమా చేస్తున్నారు. రెమ్యునరేషన్స్ అమాంతం పెంచుతున్నారు. మొన్న ఓ డిజాస్టర్ సినిమా హీరోకు 13కోట్ల రెమ్యునరేషన్ ఇచ్చారు. ఆ సినిమాకు వరల్డ్‌వైడ్ 2,3 కోట్ల షేర్ కూడా రాలేదు. ఇక నుంచైనా పెద్ద హీరోలు సంవత్సరానికి రెండు సినిమాలు చేయాలని కోరుతున్నా' అన్నారు.

## పూరి జగన్నాథ్ భవతీ భిక్షాందేహి?



సినిమాలకు భిన్నమైన పేర్లు పెట్టడంలో దిట్ట పూరీ జగన్నాథ్. తొలి సినిమా 'బద్రి' నుంచి చూసుకుంటే, దాదాపుగా ఆయన సినిమాల పేర్లన్నీ కొత్తగానే ఉంటాయి. ప్రస్తుతం విజయ్ సేతుపతి కథానాయకుడిగా ఆయన సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ఎవరి ఊహలకూ అందని పేరుని అనుకుంటున్నారట పూరీ. వివరాల్లోకెళ్తే.. ఇది పానిండియా ప్రాజెక్ట్ కావడంతో.. 'బెగ్గర్' అనే పేరుని ముందు ఈ సినిమా కు టైటిల్‌గా అనుకున్నారట. అయితే.. ఆ టైటిల్‌కి విజయ్‌సేతుపతి అభ్యంతరం చెప్పారట. 'బెగ్గర్' అనే టైటిల్ తెలుగులో అయితే ఓకే.. తమిళ ప్రేక్షకులు మాత్రం ఈ ఇంగ్లిష్ టైటిల్‌ని అంగీకరించరని ఆయన నిర్మొహమాటంగా చెప్పేశారట. పైగా 'పిచ్చైకారన్'(తెలుగులో 'బిచ్చగాడు') అనే సినిమా అక్కడ కూడా అఖండ విజయం అందుకున్న విషయం తెలిసిందే. అందుకే అదే అర్థం వచ్చేలా, అన్ని భాషలకూ సరిపోయేలా ఓ మంచి టైటిల్ అనుకోండని విజయ్ సేతుపతి సలహా ఇచ్చారట. దాంతో.. అన్ని భాషలకూ కలిసొచ్చేలా 'భవతీ భిక్షాందేహి..' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట పూరీ. 'భవతీ భిక్షాందేహి' అనేది సంస్కృత పదం కాబట్టి, ఏ భాషలోనూ సమస్య రాదని పూరీ ఆలోచన. మరి ఈ టైటిల్ ఖరారవుతుందా? లేదా? అసలు ఈ వార్తలో నిజం ఉందా? లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



## లిమిటెడ్ ఎడిషన్ అంటూ ఆఫర్

సిడ్నీ స్వీనీ.. ఈ చిన్నది ఓ హాలీవుడ్ నటి. ఈ ముద్దుగుమ్మ చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన ఫ్యాన్స్ కోసం స్నానం చేసిన నీటిని నిల్వ చేసి మరీ వాటితో సబ్బు తయారు చేయించింది. ఇటీవల, సిడ్నీ Dr. Squatch అనే సబ్బు బ్రాండ్‌తో కలిసి సిడ్నీస్ బాత్ వాటర్ బ్లిస్ అనే లిమిటెడ్ ఎడిషన్ సబ్బును విడుదల చేసింది. ఇది సిడ్నీ స్వీనీ స్నానం చేసిన నీటితో తయారు చేశారు. ఈ సబ్బును ప్రకటించి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది ఈ ముద్దుగుమ్మ. ఈ సబ్బు జూన్ 6, 2025 నుండి అందుబాటులో ఉండనుంది. ఈ సబ్బు ధర 8 డీలర్స్ అలాగే ఇవి కేవలం 5,000లు మాత్రమే తాయారు చేశారు. ప్రతి సోప్ కు ఒక సర్టిఫికేట్ ఆఫ్ ఆథెంటిసిటీ ఉంటుంది. ఇది జూన్ 6, 2025 నుండి డాక్టర్ స్క్వాచ్ వెబ్‌సైట్‌లో 8 డీలర్స్( మన కరన్సీలో రూ. 700)కి అందుబాటులో ఉంటుంది. అలాగే, 100 సబ్బులను గెలుచుకునేందుకు మే 29 నుండి జూన్ 4 వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గివ్‌అవే కూడా నిర్వహిస్తున్నారు. ఈ సబ్బులో ఎక్స్‌ఫోలియేటింగ్ ఇసుక, పైన్ బార్క్ ఎక్స్‌ట్రాక్ట్, పైన్, డగ్లస్ ఫిర్, ఎర్తీ మాస్ వంటి సుగంధాలు ఉన్నాయి.



## క్యూట్ క్యూట్ చిన్నది..

టిక్ టాక్ ద్వారా ఎంతో మంది తమ ట్యాలెంట్‌ను ప్రపంచానికి చాటుకున్నారు. ఈ వీడియోల ద్వారానే టిక్ టాక్ దుర్గారావు వంటి వారు ప్రాచుర్యంలోకి వచ్చారు. కొందరు టీవీ షోల్లోకి కూడా అడుగు పెట్టారు. మరికొందరు ఇప్పుడు సినిమాలతో బిజీగా ఉంటున్నారు. వారిలో దీపికా పిల్లి ఒకరు. ఈ బ్యూటీ లిప్‌సింకింగ్, డబ్ స్మాష్ కామెడీ వీడియోలకు అప్పట్లో మంచి క్రేజ్ ఉండేది. టిక్ టాక్‌లో ఈ బ్యూటీ ఫాలోవర్ల సంఖ్య దాదాపు 1.1 మిలియన్లు అంటే ఏ రేంజ్‌లో పాపులర్ అయ్యిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇదే పాపులారిటీతో బుల్లితెరకు పరిచయమైందీ అందాల తార. ప్రముఖ డ్యాన్స్ షో ఢీలో యాంకర్ అండ్ మెంటార్ గా సక్సెస్ అయ్యింది. యాంకర్ గా పలు టీవీ షోలకు యాంకర్ గా చేసిన దీపికా పిల్లి తన గ్లామర్ తో పేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఈ చిన్నది సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన వాంటెడ్ పండుగాడు సినిమాతో హీరోయిన్ గా మారింది దీపికా పిల్లి. ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రీసెంట్ గా యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా నటించిన అక్కడమ్మాయి ఇక్కడబ్బాయి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఈ సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. కానీ దీపికా పిల్లి నటనకు మంచి మార్కులు పడ్డాయి. టీవీ షోలు, సినిమాలే కాదు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది ఈ చిన్నది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది దీపికా పిల్లి. తాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది ."అలలు పొంగి పారితే చెలియ పలుకు జ్ఞాపకం మేఘమాల సాగితే మోహకథలు జ్ఞాపకం.. మనసు లేకపోతే మనిషి ఎందుకంటా" అంటూ సాంగ్ లిరిక్ తో కొన్ని ఫోటోలు పంచుకుంది.

## ఫ్లాపులు వచ్చినా తగ్గని క్రేజ్..



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం రెట్రో . కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటించింది. . స్వసిక, నాజర్, జోజు జార్జ్, కరుణాకరన్, సింగంపులి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మేడే కానుకగా విడుదలైన రెట్రో సినిమాకు మిక్స్ డ్ టాక్ వచ్చింది. తమిళంలో బాగానే ఆడినా తెలుగుతో పాటు ఇతర భాషల్లో రెట్రో ఆదరణకు నోచుకోలేదు. అంతకు ముందు కంగువా సినిమాకు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. అయితే సినిమాలు చేయడంలో సూర్య స్పీడ్ ఏ మాత్రం తగ్గడం లేదు. రెట్రో షూటింగ్ పూర్తి కాకముందే, నటుడు సూర్య తన 45వ చిత్రం కోసం దర్శకుడు, నటుడు RJ బాలాజీతో జతకట్టాడు. ఈ చిత్రంలో నటి త్రిష కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవల ఈ సినిమా గురించి మాట్లాడిన నిర్మాత, షూటింగ్ త్వరలో పూర్తవుతుందని, సినిమా ఖచ్చితంగా పండుగ రోజున విడుదల అవుతుందని అన్నారు. దీపావళికి విడుదల అవుతుందా అని విలేకరులు అడిగినప్పుడు, ఆయన నవ్వుతూ, పండుగ రోజున ఉంటుందని అన్నారు.

రెట్రో సినిమా థియేటర్లలో ఉండగానే సూర్య వెంకీ అట్లూరితో జతకట్టాడు. ఇటీవలే పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి . ఈ కార్యక్రమంలో నటుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరితో పాటు నటి మమిత బైజు, సంగీత స్వరకర్త జి.వి. ప్రకాష్‌కుమార్ కూడా పాల్గొన్నారు. జీవీ ప్రకాష్ కుమార్ గతంలో వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన సూపర్ డూపర్ హిట్ లక్కీ భాస్కర్ చిత్రానికి సంగీతం సమకూర్చాడు. ఇప్పుడు మళ్లీ వెంకీతోనే జత కట్టాడు. ఇది సూర్య నటిస్తోన్న 46వ చిత్రం. తమిళంతో పాటు తెలుగులోనూ తెరకెక్కుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్ ఈ సినిమాను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి ముందే ఈ సినిమా ఓటీటీ హక్కులు అమ్ముడుపోయినట్లు సమాచారం. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమాను దాదాపు 85 కోట్లకు చిత్రాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com